క్లుప్తంగా

## ప్రశాంతంగా నవోదయ ఎంట్రెన్స్ పరీక్ష



వెంకటాపురం(కె): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నవోదయ ఎంట్రెన్స్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన 112 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. ఇంగ్లిష్ మీడియంలో 67 మందికి ఆరుగురు, తెలుగు మీడియంలో 45 మందికి ఆరుగురు మొత్తం 12 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని వెంకటాపురం సీఐ కుమార్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య పరిశీలించారు. ఆయన వెంట పరీక్ష నిర్వాహకులు రామకృష్ణ, జీవీవీ సత్యనారాయణ ఉన్నారు.

## రేపు రెవె'న్యూ' కార్యాలయం ప్రారంభం

ములుగు : మల్లంపల్లి నూతన మండలకేంద్రంలో ఈనెల 20న మండల రెవెన్యూ కార్యాలయం ప్రారంభించనున్నట్లు పార్టీ సీనియర్ నాయకుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క రానున్నందున ఆయా గ్రామాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కొన్నేళ్లుగా వేచి చూస్తున్న కల సాకారం అవుతున్న వేళ కార్యక్రమాన్ని పండుగలా జరుపుకోవడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని అన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



హసనపర్తి: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఇరిగేషన్ ఈఈ నారాయణ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి పారుదల శాఖ నర్సంపేట, భూపాలపల్లి, ఏటూరునాగారం డివిజన్ పరిధి లోని ఉద్యోగుల క్రీడాపోటీలు నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రా రంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా నీటిపారుదల శాఖ ఈఈ నారాయణ పాల్గొని మాట్లాడుతూ వృత్తిరీత్యా తీరికలేకుండా ఉండే ఉద్యోగులకు ఈ పోటీలు మానసిక వికాసానికి దోహదపడుతాయని అన్నారు. డీఈఈలు ప్రసాద్, గోకారపు శరత్‌బాబు, ఆర్.రవికుమార్, యశ్వంత్, గిరిధర్, రమేష్, ఏఈలు భాస్కర్, ప్రణీత్, డీఓ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



టేకుమట్ల: మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన బహుజన సమాజ్ పార్టీ కార్యవర్గ సభ్యుడు సంగి రవి తండ్రి రత్నం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి, జిల్లా ఇన్‌చార్జ్ సుమన్, నాయకులు భిక్షపతి, రవి, ప్రశాంత్, శ్రీనాథ్ ఉన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత



చిట్యాల : యోగాతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని యోగా గురువు రఘుపతి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా అంటే శరీర, మనస్సు, భావోద్వేగం, శక్తిస్థాయిలను అభివృద్ధి చేసే వ్యాయామ సాధనల సమాహారం అన్నా రు. యోగాలో శారీరక భంగిమలు, శ్వాస పద్ధతులు, ధ్యానం వంటివి ఉంటాయన్నారు. యోగా చేయడం వల్ల నొప్పులు, ఒత్తిడి తగ్గుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి తప్పకుండా యోగా చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యుగంధర్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా చెట్ల నరికివేత

- బోసిపోయి కనిపిస్తున్న రోడ్డు
- సగం వరకే చెట్ల నరికివేతపై పలువురి ఆగ్రహం



రోడ్డుకిరువైపులా సగం వరకు నరికిన చెట్లు

గోవిందరావుపేట : గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి చెట్లుగా మారి నీడనిస్తున్నాయి. పొలంలో నీడ పడి పొలంలో వరి వంగడాల ఎదుగుదలకు అడ్డు పడుతున్నాయని ఏపుగా పెరిగిన చెట్లను సగం వరకు నరుకుతున్న సంఘటన మండలంలోని గాంధీనగర్ పాపయ్యపల్లి గ్రామాల మధ్య జరిగింది. ఈ నేపథ్యంలో పలుచోట్ల చెట్ల కొమ్మలను సగం వరకు నరికివేయడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజులు రోడ్డుకు ఇరువైపుల ఎంతో నీడతో పాటు ఆహ్లాదాన్ని ఇచ్చే పచ్చని చెట్లను నరకడంతో ప్రస్తుతం రోడ్డు బోసిపోయి కనిపిస్తుంది. గాంధీనగర్, పాపయ్యపల్లి గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కష్టపడి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ పెంచి పెద్ద చేస్తే బాధ్యతారాహిత్యంగా నరికివేయడం తీవ్ర ఆవేదన కలిగిస్తుందన్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి చెట్ల నరికివేసే వారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ హితులు, గాంధీనగర్, పాపయ్యపల్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నోటీసులు ఇచ్చాం



పొలంలో నీడ పడి వంగడాలు ఎదగడం లేదని ఏపుగా పెరిగిన చెట్లను సగం వరకు నరికిన విషయం మా దృష్టికి రావడంతో వారికి జరిమానా వేసి మరోసారి జరిగితే చర్యలు ఉంటాయని నోటీసులు ఇచ్చాం. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.
– దీకొండ అనిల్‌కుమార్, గాంధీనగర్ ఇన్‌చార్జ్ కార్యదర్శి

# వాహనదారులు బాధ్యతగా నడుచుకోవాలి

- డీఎస్పీ ఎన్.రవీందర్



ములుగు : రోడ్డుభద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ రవీందర్, పోలీసులు



వెంకటాపురం(ఎం) : హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ములుగు: వాహనదారులు సామాన్య ప్రజలకు హానీ జరగకుండా బాధ్యతగా నడుకోవాలని ములుగు డీఎస్పీ ఎన్.రవీందర్ సూచించారు. ఈ మేరకు రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని బండారుపల్లి క్రాస్‌రోడ్డు మీదుగా సుమారు 200 ఫోర్ వీలర్స్ వాహనాలతో రంగారావుపల్లి సమీపంలోని రవాణాశాఖ కార్యాలయం వరకు రోడ్డుభద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్పీ రవీందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారుల్లో 80శాతం మంది హెల్మెట్ ధరించని కారణంగా ప్రాణాలు కోల్పోతున్నట్లుగా కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. వాహనాలకు అన్ని రకాల అనుమతి పత్రాలు, వాహనదారుడికి లైసెన్స్ ఉండడం తప్పనిసరి అన్నారు. అనంతరం ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, సీఐ శంకర్ మాట్లాడారు. వాహనదారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సీహెచ్.వెంకటేశ్వర్‌రావు, రామకృష్ణ, లక్ష్మారెడ్డి, రవాణాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, యూనియన్ బ్యాంకుల ఏటీఎం సెంటర్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఏటీఎం సెక్యూరిటీ గార్డులు పని సమయాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా అనుమానితులు బ్యాంకు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లుగా కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు ఏటీఎం సిబ్బందికి సూచనలు చేస్తున్నామని తెలిపారు.

**బైక్ ర్యాలీ..**

వెంకటాపురం(ఎం): వాహనదారులు హెల్మెట్ ధరించాలని ములుగు డీఎస్పీ రవీందర్ పిలుపునిచ్చారు. ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అంటూ శనివారం మండల కేంద్రంలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని చౌరస్తాలో వాహనదారులనుద్దేశించి డీఎస్పీ మాట్లాడారు. వాహనదారులు మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చని వెల్లడించారు. ములుగు సీఐ శంకర్, ఎస్సై జక్కుల సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జయరాంరెడ్డి

మంగపేట : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి పోటీచేసే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి సత్తా చాటాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పటేల్ ఆదేశాల మేరకు మండలంలోని పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా జయరాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, అన్నివర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగిస్తున్న జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని దీంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రభుత్వం సాగిస్తున్న ప్రజాపాలన, అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను గ్రామ గ్రామాన గడప గడపకు చేర్చి ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఇప్పటికే ఎంపీటీసీ పరిధిలో ఒక్కో క్లస్టర్ వారీగా క్లస్టర్‌కు ఐదుగురి చొప్పున బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, అన్ని గ్రామ కమిటీల అధ్యక్ష,కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌కు ఘన నివాళి



మంగపేట: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

వెంకటాపురం(కె): మండలంలో ఎన్‌టీఆర్ 28వ వర్ధంతిని మండల టీడీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక వేపచెట్టు సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి ఆత్మకూరి పట్టాభిరామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అలోకం నరేశ్, రమేశ్, సంజీవరావు, రమేశ్, చింతపూరి బాబు నవీన్, సాంబ, సుధాకర్ పాల్గొన్నారు.

మంగపేట : మండల కేంద్రం పరిధిలోని గంపోనిగూడెం వద్ద టీడీపీ జెండా గద్దె వద్ద ఆ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు, అభిమానులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రాజకీయ పార్టీలకతీతంగా అభిమానులు, కమ్మ సంఘం నాయకులు పూలమాలతో సత్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వల్లేపల్లి శివప్రసాద్, పచ్చా శేషగిరిరావు, తోట శ్రీనివాసరావు, నర్రా శ్రీధర్, తోట రమేష్, జాగర్లమూడి నాగేశ్వర్‌రావు, మండవ రామకృష్ణ, హనుమంతరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నేడు శృంగేరికి దేవస్థానం అధికారులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వ రం దేవస్థానంలో ఫిబ్రవరి 7, 8, 9న మూడు రోజుల పాటు కుంభాభిషేకం నిర్వహించను న్న నేపథ్యంలో అధికారులు, అర్చకులు కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని శృంగేరికి పీఠాధిపతిని ఆహ్వానించడానికి ఆదివారం తరలివెళ్తున్నారు. శృంగేరి పీఠాధిపతి, వారి శిష్య బృందం ఆధ్వర్యంలోనే కుంభాభిషేకం పూజా నిర్వహణ జరుగనుంది. ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ, సుబ్రహ్మణ్యశర్మలు ఆహ్వానం అందజేయడానికి తరలి వెళ్లనున్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

భూపాలపల్లి అర్బన్ : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో సమితి నాయకులు ఆవిష్కరించారు. యువజనుల హక్కులకై ఏఐవైఎఫ్ నిరంతరం ఉద్యమిస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్ తెలిపారు. ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు సాత్కు ప్రవీణ్, క్యాతరాజు సతీష్, జోసెఫ్, భగత్, మహేందర్, జోగేష్, సింహాద్రి, ప్రవీన్‌లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

టేకుమట్ల : మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ రూపొందించిన కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## కాపర్ వైర్ చోరీకి యత్నం

- సహకరించిన సింగరేణి సెక్యూరిటీ గార్డ్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ–2 పరిసరాల్లో శుక్రవారం రాత్రి కాపర్ వైర్, ఇనుమును గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించినట్లు తెలిసింది. గుర్తుతెలియని ఐదుగురు వ్యక్తులు కత్తులు, గొడ్డళ్లతో ఓసీ పరిసరాల్లో అర్ధరాత్రి చొరబడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ రాజేందర్ గమనించి అడ్డుకునే ప్రయత్నం చేయగా అతడిని చంపుతామని బెదిరించి సెల్‌ఫోన్ లాక్కున్నట్లు తెలిసింది. జమీందార్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో సంఘటన స్థలానికి చేరుకోగా గమనించిన దొంగలు పారిపోయినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ దొంగలకు సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న మరో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ సహకరించినట్లు సమాచారం. దొంగల ఫోన్‌కు సహకరించిన ప్రైవేట్ సెక్యూరిటీ ఫోన్ నుంచి పలుమార్లు ఫోన్ చేసినట్లు తెలిసింది. సింగరేణి సెక్యూరిటీ అధికారిని వివరణ కోరగా మురళీమోహన్ దొంగతానికి ప్రయత్నించిన విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న సెక్యూరిటి సిబ్బంది హస్తం ఉన్నట్లు అనుమానం రావడంతో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఐదుగురు కలిసి దొంగతనానికి పాల్పడినట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

## ఆలయంలో పలువురి వాగ్వాదం

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం దేవాదాయశాఖ అధికారులు, గుడి నిర్వాహకులు, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చెరువు శిఖంలో నిర్మించిన ఆలయాన్ని దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకునేందుకు నెల రోజులుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఇన్‌స్పెక్టర్ కవిత, దేవాదాయ సిబ్బంది కలిసి ఆలయానికి చేరుకున్నారు. దీంతో ఆలయ లోపలికి వెళ్లకుండా ట్రస్ట్ సభ్యులు అధికారులను అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని ఎలాగైనా దేవాదాయశాఖ ఆధీనంలో ఆలయాన్ని తీసుకుంటామని అధికారులు తెలుపగా జిల్లాలో అనేక గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయని వాటన్నింటిని అధికారులు దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకొని నిధులు కేటాయించి అభివృద్ధి చే యాలని ఎదురు తిరగడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

## ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



రేగొండ : కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్‌లోని అమరావతి కాలనీకి చెందిన చిందు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని చిందు విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం ప్రశాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా అమరావతి కాలనీకి చెందిన చిందు కుటుంబాలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మొదటి విడతలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారి లో చిందు రాజ్యాధికార సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శరత్, ఉపాధ్యక్షుడు గడ్డం పశుపతి, కళాకారులు వావిలాల లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

- ములుగు ఎస్సై లక్ష్మారెడ్డి



కిరాణాషాపులో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపడుతున్న ఎస్సై లక్ష్మారెడ్డి

ములుగు రూరల్ : నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ములుగు ఎస్సై లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మల్లంపల్లిలోని కిరాణాషాపుల్లో పోలీసులు నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కిరాణాషాపుల్లో గుట్కా, అంబర్ వంటి నిషేధిత వస్తువుల అమ్మకాలు చేపట్టకూడదని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి అమ్మకాలు చేపడితే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తనిఖీల్లో విమల్, పాన్‌బార్‌లు పట్టుకొని సీజ్ చేశామని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సరోత్తంరెడ్డి

ములుగు రూరల్ : ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, పీఆర్సీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి అన్నారు. శనివారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 347 జీఓను రద్దు చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని అన్నారు. సర్వశిక్షా ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ఉద్యోగులకు అందించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు చీకటి సమ్మయ్య, పురుషోత్తంరెడ్డి, గంట సంజీవరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, రవీంద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.

# 21 నుంచి 24 వరకు గ్రామసభలు

ఏటూరునాగారం: ఈనెల 21 నుంచి గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 21న అల్లంవారిఘణపురం, చెల్పాక, చిన్నబోయినపల్లి, 22న ఏటూరునాగారం, కొండాయి, కోయగూడ ఎల్లాపురం, 23న ముళ్లకట్ట, రామన్నగూడెం, రొయ్యూర్, 24న శంకరాజుపల్లి, షాపెల్లి, శివాపురం గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరో సా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేయడానికి ఈ సభలను చేపడుతున్నట్లు తెలిపారు.

వెంకటాపురం(కె): మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈ నెల 21 నుంచి 24 వరకు ఇందిరమ్మ గ్రామసభలను నిర్వహించ నున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ శనివారం తెలిపారు. 21న ఆలుబాక, బీసీ మర్రిగూడెం బోదాపురం, బెస్తగూడెం, మరికాల, వెంకటాపురంలో, 22న బర్లగూడెం, ఎదిర, మొర్రవానిగూడెం, పాత్రపురం, 23న నూగూరు, రాచపల్లి, సూరవీడు, ఉప్పేడువీరాపురంలో, 24వ తేదీన తిప్పాపురం, రామచంద్రాపురం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# దుండగులను కఠినంగా శిక్షించాలి

- బీఆర్‌ఎస్ ఫ్లెక్సీ చించివేత
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రవీందర్

చిట్యాల: మండలంలోని కై లాపూర్ శివారులో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చింపివేసినట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ తెలిపాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు దుండగులు కావాలనే చింపివేయడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఏనాడు ఇలాంటి చిల్లర పనులు చేయలేదన్నారు. కావాలనే బీఆర్‌ఎస్ పార్టీపై కొందరు దుండగులు ఇలాంటి చర్యలకు పూనుకున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శులు ఏరుకొండ రాజేందర్ గౌడ్, మడికొండ రవీందర్‌రావు, నాయకులు చిలుముల రమణాచారి, దామెర రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గించొచ్చు



క్రీడాకారులకు షీల్డ్ అందజేస్తున్న శ్రీనుబాబు

మల్హర్: క్రీడలతో మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చని అందరూ సాధ్యమైనంత వరకు ఏ క్రీడారంగానికి సమయం కేటాయిస్తే ఆరోగ్య వంతంగా జీవించవచ్చని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. మండలంలోని కిషన్‌రావుపల్లిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడారంగంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, మండల యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, మండల రాహుల్ పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమత–నాగరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలిచిన విజేత జట్లకు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు బహుమతులు అందజేశారు. శనివారం రాత్రి ఆయన కాళేశ్వరంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు, మెమొంటోలు అందజేసి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

భూపాలపల్లి రూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు నిర్వహిస్తున్న సర్వేలో ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం అందించే పథకాలను అందిపుచ్చుకోవాలని 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో గుడి బడి ప్రదేశంలో కొత్తరేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రేషన్‌కార్డులు లేని ప్రతి ఒక్కరూ వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ రాజేశ్వర్, స్పెషల్ ఆఫీసర్ సిద్ధార్థ్, వార్డ్ ఆఫీసర్లు,తదితరులు పాల్గొన్నారు.